సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం ; 11 ; ఏప్రిల్ ; 2023



ఉపాధి పనులకు ఇక్కట్లు

నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో కిందిస్థాయి సిబ్బందిపై అదనపు పనిభారం పడుతోంది. 9లో▸

జూడాల సమ్మె వాయిదా

ఆదిలాబాద్‌టౌన్: జూనియన్ డాక్టర్లు తల పెట్టిన సమ్మె వాయిదా పడిందని తెలంగాణ జూడాల సంఘం రిమ్స్ అధ్యక్షుడు అరుణ్ తెలిపారు. హైదరాబాద్‌లో తమ సంఘం నాయకులు అధికారులతో జరిపిన చర్చల్లో హామీ ఇవ్వడంతో వెనక్కి తగ్గినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.3 /26.8

ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. రోజంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ : 6:30	బుధ : 4:44

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ఆర్‌జేడీ

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్ష కేంద్రాలను వరంగల్ ఆర్‌జేడీ, పరీక్షల రాష్ట్ర పరిశీలకులు సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. సోమవారం నేరడిగొండ, గుడిహత్నూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల నం.2 పాఠశాలలను తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోనికి ఎవరు సెల్‌ఫోన్‌లు తీసుకురావద్దని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్ ఉన్నారు.

పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి



ప్యాకెట్లు అందిస్తున్న మధుసూదన్

బేల(ఆదిలాబాద్): రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని విజయ డెయిరీ సంచాలకుడు మధుసూదన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొబ్బాయిలో రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా పశువులకు లంపీస్కిన్ నివారణ టీకాలు ఇచ్చారు. జీర్ణశక్తి పెంపుదలకు మినరల్ మిక్స్ ప్యాకెట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేల డెయిరీలో రోజుకు వెయ్యి లీటర్ల పాలు సేకరించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాక్రే గంభీర్, నాయకులు సతీష్‌పవార్, రాక్రే మంగేష్, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న ఖోడద్ రైతులు

కైలాస్‌నగర్: ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జీల కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణికి తరలివచ్చిన బాధిత రైతులు ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజకు తమగోడు వెల్లబోసుకున్నారు. ఎల్సీ నెంబర్ 25, 26ల వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జీలు వర్షపు నీటితో నిండుకోవడంతో తమ పంటచేలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కైలాస్‌నగర్: డీఆర్‌డీవో ఆధ్వర్యంలో అందించే ఉచిత కంప్యూటర్ క్రాష్ కోర్స్‌లో 30 రోజుల శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 50 శాతం మార్కులు కలిగి, ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసినవారు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 13లోగా తమ దరఖాస్తులను ఆదిలాబాద్‌లోని టీటీడీసీలో ప్రత్యక్షంగా, లేదా ఈమెయిల్ (ewrcadilabad@ gm ail. com) ద్వారా అందజేయాలని సూచించారు.

12న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఈనెల 12న అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పిట్ల రాజేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్న ఈ పోటీలకు అండర్–20 బాలబాలికలు అర్హులన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రంతో బుధవారం ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలన్నారు. ఎంపికైనవారు ఈ నెల 15, 16 తేదీల్లో హన్మకొండలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఏజెన్సీ గొంతెండుతోంది!

- 'గిరి' గ్రామాలకు అందని మిషన్ భగీరథ నీళ్లు
- రెండు జిల్లాల్లోని పది మండలాలపై ప్రభావం
- విద్యుత్ సమస్యే కారణమంటున్న అధికారులు
- కలుషిత నీరే తాగుతున్న గిరిజనులు

సాక్షి, ఆదిలాబాద్: ఏజెన్సీలో గిరిజనులు వేసవి ప్రారంభంలోనే దాహం.. దాహం అంటూ తల్లడిల్లిపోతున్నారు. గ్రామాల్లో ఉన్న చేతిపంపుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం, మరోవైపు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో పరిస్థితి తీవ్ర రూపం దాల్చుతోంది. ప్రధానంగా కుమురంభీం అడ ప్రాజెక్ట్ నీటి వనరుగా ఉన్న ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలు గుక్కెడు నీటికోసం తాపత్రయపడుతున్నారు. రోజూ నీటికోసం కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి బావులు, చెలిమెల వద్ద బారులు తీరి నీటిని తోడుకుంటున్నారు. విద్యుత్ సమస్య కారణంగా జిల్లాలోని పది మండలాల్లో ప్రభావం కనిపిస్తోందని, అందులో ఓ ఐదు మండలాల్లో తీవ్రత పెరిగిందని మిషన్ భగీరథ అధికారులు పేర్కొంటున్నారు.



ఇంద్రవెల్లి మండలం కొలాంగూడలో వ్యవసాయ బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజనులు

ఇదీ పరిస్థితి..

ఇంద్రవెల్లి మండలం దొడంద, చిలాటిగూడ, గట్టెపల్లి, చిత్తగూడ, టేకిడిగూడ, కొలాంగూడ, జెండాగూడ, పొల్లుగూడ, మామిడిగూడ, సాలెగూడ, ఖైరుగూడ, బుర్సన్‌పటార్, గోపాల్‌పూర్, తదితర గ్రామాల్లో నీటిగోస తీవ్రంగా ఉంది. ఇక కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు, ఆదిలాబాద్ జిల్లాలోని ఐదు మండలాల్లోని అనేక అనుబంధ గ్రామాల్లో పరిస్థితి తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికైతే దూరంగా ఉన్న బావులు, చెలిమెల్లో నీటిని సేకరిస్తున్నారు. మరికొన్ని రోజులైతే అవికూడా దొరికే పరిస్థితులు లేవన్న ఆందోళన జనాల్లో కనిపిస్తోంది.



ఇంద్రవెల్లి మండలం చిత్తగూడలో చేతిపంపు నీటిని మోసుకొస్తున్న గ్రామస్తులు

కరెంటు పోతే.. అంతే సంగతి

అడ ప్రాజెక్ట్‌కు సంబంధించి కెరమెరి మండలం ధనోర వద్ద నీటి శుద్ధి ప్లాంట్ (డబ్ల్యూటీపీ) ఉంది. ఇక్కడ శుద్ధి అయిన నీళ్లు మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ ద్వారా జైనూర్ మండలంలోని భూసిమెట్ట, కెరమెరి మండలంలోని కేస్లాగూడకు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఈ పది మండలాల వరకు ఇంట్రా పైపులైన్ ద్వారా నీళ్లు చేరాలి. అయితే భూసిమెట్ట, కేస్లాగూడకు నీళ్లు చేరవేసే క్రమంలో విద్యుత్ సమస్య నిత్యం ఎదురవుతున్నట్లు మిషన్ భగీరథ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో కొన్ని గ్రామాలకు ఆ రోజు కాకపోయినా మరుసటి రోజు నీరు చేరేలా చూస్తున్నామని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నీటి కోసం గిరిజనులు కిలో మీటర్ల వరకు కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఇతర పనులను పూర్తిగా వదిలేసి నీటి కోసమే కుస్తీ పడాల్సిన పరిస్థితి. ఇలాంటి అనుబంధ గ్రామాలకు కరెంటు సమస్య ఉత్పన్నం కాకుండా, నీళ్లు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీటి ప్రభావం ఉన్న మండలాలు..

ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, ఇంద్రవెల్లి, సిరికొండ, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, తిర్యాణి.

వ్యవసాయ పనులు మానేసి..



మా గ్రామంలో ఉన్న చేతిపంపుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి నీరు రావడం లేదు. ఒకటే చేతిపంపులో నీళ్లు వస్తున్నాయి. మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదు. దీంతో వ్యవసాయ పనులు మానేసి తెలవారుజామునే లేచి ఒకే చేతిపంపు వద్ద బారులుతీరుదూ వరుసక్రమంలో నీటిని తెచ్చుకుంటున్నాం.

– కుమ్రం గంగుబాయి, గట్టెపల్లి, ఇంద్రవెల్లి

కలుషిత నీరే దిక్కు



గ్రామానికి దూరంగా ఉన్న చేతిపంపులో నుంచి వచ్చే కలుషిత నీటినే తెచ్చుకుంటున్నాం. వేరే గత్యంతరం లేక వాటినే తాగుతున్నాం. అటు గ్రామంలో ఉన్న మంచినీటి పథకాలు కూడా పనిచేయడం లేదు. ఇటు మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదు.

– పెందూర్ చిన్ను, చిత్తగూడ, ఇంద్రవెల్లి

సమస్య తీవ్రత ఉంది

నీటిని తరలించే క్రమంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. దీంతో పలు గ్రామాలకు నీరు చేరడం లేదు. ఒకరోజు మినహాయించి మరో రోజు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మధ్యలో కరంటు పోయినప్పుడు పూర్తిస్థాయిలో నీళ్లు నింపలేకపోతున్నాం. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వర్‌రావు, కుమురంభీం ఆసిఫాబాద్ గ్రిడ్ ఈఈ

మళ్లీ పెరుగుతున్న కోవిడ్

- జిల్లాలో ఐదుగురికి పాజిటివ్ నిర్ధారణ
- అప్రమత్తత తప్పదంటున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. వారం, పది రోజుల నుంచి పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. సోమవారం ఐదుగురికి పాజిటివ్ నిర్ధారణ కావడం కలవరానికి గురిచేస్తోంది. 90 మందికి పరీక్షలు నిర్వహించగా 85 మందికి నెగిటివ్ వచ్చింది. ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడలో 45 ఏళ్ల వ్యక్తికి, సిరికొండ మండలంలోని రాజంపేటలో మహిళకు, గుడిహత్నూర్ మండల కేంద్రంలో యువతికి, సూర్యగూడలో ఆరేళ్ల బాలునికి, జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌లో ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం జిల్లాలో పది యాక్టివ్ కేసులున్నాయి. ఏడుగురు హోం ఐసోలేషన్‌లో, ముగ్గురు రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసులు పెరుగుతున్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్ నిబంధనలను విధిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నరేందర్ రాథోడ్ సూచించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి నర్సయ్య

జైనథ్(ఆదిలాబాద్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, సుజాత్‌ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని మేడిగూడ– ఆర్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. వేసవికాలంలో విద్యార్థులకు ఎండదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం పాఠశాలలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యవాన్ చిక్టే, నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి జిల్లా ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సంబంధ, పింఛన్లు, ఉపాధి కల్పన, డబుల్ బెడ్ రూం ఇళ్లు, తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వారంలోగా పరిష్కరించేలా శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమ అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని పశుసంవర్ధకశాఖ అధికారిని ఆదేశించారు. ఈ నెల 14న హైదరాబాద్‌లో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి 12 బస్సులను పంపించనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు బస్సులు బయలు దేరుతాయని, అల్పాహారం, భోజనం, ఇతరత్రా ఏర్పాట్ల బాధ్యతలను ఆయా సంబంధిత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీ సీఈవో గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలు విజయవంతం చేయాలి

కైలాస్‌నగర్: ఈ నెల 14న జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో దళిత, గిరిజన, మైనార్టీ సంఘాల నాయకులు, సంబంధిత శాఖల అధికారులతో వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 13న సాయంత్రం 5 గంటలకు స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో విగ్రహావిష్కరణ, 14న వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ చౌక్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ ఎత్తుపెంచాలని కోరుతూ ఉత్సవ సమితి సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కరోనాతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: కరోనాతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రిలో కోవిడ్‌పై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తుగా ఏర్పాట్లను చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు. బాధితులకు చికిత్స అందించేందుకు రిమ్స్ ఆస్పత్రిలో 50 ఐసోలేషన్ బెడ్లు, 500 ఆక్సిజన్ బెడ్లు, వెంటిలెటర్లు, సరిపడా ఆక్సిజన్ ఉందన్నారు. ప్రజలు విందులు, వినోదాలకు దూరంగా ఉండాలని, భౌతిక దూరం పాటించడంతో పాటు మాస్కులు విధిగా ధరించాలని సూచించారు. మొదటి, రెండో విడతలో కోవిడ్ ఉధృతి కారణంగా తీవ్ర నష్టం జరిగిందని, ప్రస్తుతం దాని ప్రభావం అంతగా లేనప్పటికీ ప్రతిఒక్కరూ కోవిడ్ నిబంధనలను పాటిస్తే గట్టెక్కవచ్చన్నారు. వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ సందీప్‌కుమార్, చందు, తిప్పేస్వామి, క్రాంతికుమార్, తదితరులు ఉన్నారు.



మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న రిమ్స్ డైరెక్టర్


అసెస్‌మెంట్ గోల్‌మాల్

- మున్సిపల్ ఆస్తిని గ్రామ పంచాయతీగా మార్పు
- రూ.1.49 కోట్ల బకాయిలు ఎగ్గొట్టేందుకు కొత్త ఎత్తుగడ
- విమర్శలకు తావిస్తున్న బల్దియా అధికారుల తీరు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బల్దియాలో అసెస్‌మెంట్ల గోల్‌మాల్ జరుగుతోంది. కోట్లలో బకాయిపడ్డ ఆస్తి పన్నుకు ఎగనామం పెట్టేందుకు ఓ బడా వ్యాపారి వేసిన ఎత్తుగడకు బల్దియా అధికారులు వంతపాడడం విస్మయానికి గురిచేస్తోంది. సామాన్య జనం నుంచి ముక్కుపిండి మరీ పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు సదరు బడావ్యాపారిపై ఎందుకంత ప్రేమ చూపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొండి బకాయిలను వసూలు చేసేలా కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు వాటిని ఎగ్గొట్టేలా ప్లాన్ చేసిన వ్యాపారికి అండగా నిలువడంలో ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఏళ్లుగా బల్దియా పరిధిలో కొనసాగిన సదరు వ్యాపారి సంస్థను పన్నులు ఎగ్గొట్టేందుకు వీలుగా గ్రామ పంచాయతీ పరిధిలోకి మార్చడం వెనుక ఏం జరిగిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆధీనంలో కొనసాగిన స్పిన్నింగ్‌మిల్లును ఓ బడా వ్యాపారి కొనుగోలు చేశాడు. రికార్డుల పరంగా మిల్లు బల్దియా పరిధిలోనే ఉంది. 2007 నుంచి 2023 వరకు మున్సిపల్ అధికారులు దానికి పన్ను విధిస్తున్నారు. అయితే సదరు వ్యాపారి మాత్రం బల్దియాకు చెల్లించకపోవడంతో ప్రస్తుతం పన్ను బకాయిలు రూ.1,49,36,638కు చేరాయి. కోట్లలో పేరుకుపోయిన ఆ స్పిన్నింగ్‌మిల్లు నుంచి పన్నులు ఎందుకు వసూలు చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వేలల్లో బకాయిపడ్డ సాధారణ ప్రజలపై కఠినంగా వ్యవహరించే అధికారులు ఇంత పెద్ద మొత్తంలో చెల్లించాల్సిన సదరు వ్యాపారిని ఎందుకు చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించి బల్దియాకు బకాయిపడ్డ ఆస్తిపన్ను వివరాలు



బట్టిసావర్గాం పంచాయతీ పరిధిలోనే రెసిడెన్సియల్ ఏరియాలో ఉన్నట్లుగా చేసిన అసెస్‌మెంట్

మున్సిపల్ నుంచి జీపీ పరిధికి మార్పు

ఆ స్పిన్నింగ్‌మిల్లుకు సంబంధించిన ఆస్తిపన్ను ఎగ్గొట్టేందుకు కొత్త ఎత్తుగడ వేశారు. 2007 నుంచి 2023 వరకు మున్సిపల్ పరిధిలో ఇండస్ట్రీయల్ ఏరియాగా కొనసాగిన ఈ స్పిన్నింగ్‌మిల్లు బట్టిసావర్గాం పంచాయతీ పరిధిలో ఉన్నట్లు రికార్డుల్లో క్రియేట్ చేశారు. 2022–23 వరకు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నట్లుగా క్రియేట్ చేసిన అధికారులు అందులోనూ పొరపాటు చేశారు. ఒక డోర్ నంబర్ పేరిట నాన్ రెసిడెన్సియల్‌గా పేర్కొంటూ రూ.79,886 పన్ను బకాయిపడినట్లుగా నమోదు చేశారు. అలాగే మరో డోర్ పేరిట రెసిడెన్సియల్ ఏరియాలో ఉన్నట్లుగా అసెస్‌మెంట్ నమోదు చేసి రూ.47,675 పన్ను బకాయిపడినట్లుగా పేర్కొన్నారు. కొత్త అసెస్‌మెంట్లకు పడ్డ బకాయిలను కట్టించుకున్నారు. కోట్లలో బకాయిపడిన సదరు వ్యాపారి ప్రస్తుతం ఎలాంటి డ్యూ లేనట్లుగా రికార్డులను తయారు చేశారు. బడా వ్యాపారికి లబ్ధి చేకూర్చేందుకు జరిగిన ఈ తతంగం వెనుక ఏం జరిగిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మామూలుగా తీసుకుని అసెస్‌మెంట్లను మార్చారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు సదరు వ్యాపారికి లబ్ధి చేకూర్చడం వెనుక జరిగిన ఆంతర్యం ఏమిటన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

అడిషనల్ కలెక్టర్‌కు లేఖ రాశాం

స్పిన్నింగ్ మిల్లు కలిగిన ప్రాంతం మున్సిపల్ పరిధిలోకి వస్తుందా? లేక బట్టిసావర్గాం పంచాయతీ పరిధిలోకి వస్తుందా? అనే విషయంపై 2006 నుంచి కేసు నడుస్తోంది. ప్రస్తుతం ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆర్డీవోను విచారణ అధికారిగా నియమించారు. ప్రస్తుతం ఆర్డీవో ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. పన్నులు ఎగ్గొట్టేలా వ్యవహరిస్తే మాత్రం ఎవర్నీ ఉపేక్షించం. బట్టిసావర్గాం పంచాయతీ పరిధిలో ఉన్నట్లుగా జరిగిన అసెస్‌మెంట్ల విషయమైతే నా దృష్టికి రాలేదు.

– శైలజ, మున్సిపల్ కమిషనర్

ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన ఎన్‌క్వాస్ బృందం

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికేషన్ (ఎన్‌క్వాస్) బృందం సోమవారం జిల్లా కేంద్రంలోని పుత్లిబౌలి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసింది. పూణేకు చెందిన ఇందిరా, తమిళనాడుకు చెందిన మంజులతో కూడిన బృందం ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతల వివరాలు, టీబీ, కుష్ఠుతో పాటు 14 జాతీయ కార్యక్రమాల అమలును పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం కూడా ఇదే ఆస్పత్రిలో, భీంపూర్ మండలంలోని ధనోరా వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించనున్నారు. ఎన్‌క్వాస్ కింద ఎంపికైతే సదరు పీహెచ్‌సీకి ఏడాదికి రూ.2లక్షల చొప్పున మూడేళ్ల పాటు కేంద్ర నిధులు అందనున్నాయి. ఇప్పటికీ జిల్లాకు 11 అవార్డులు దక్కగా వీటిలో 8 పీహెచ్‌సీలు, మూడు పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ బృందం వెంట డెప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ప్రోగ్రాం ఆఫీసర్లు ఉన్నారు.



బృందానికి స్వాగతం పలుకుతున్న వైద్యసిబ్బంది

క్లుప్తంగా

దివ్యాంగులను మోసగించిన వ్యక్తిపై కేసు

లోకేశ్వరం: దివ్యాంగులను మోసగించిన నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన కథలాపూర్ ప్రవీణ్‌పై సోమవారం లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. లోకేశ్వరం మండలంలోని ధర్మోర, పంచగుడి, వట్టోలి, పిప్రి, మొహళ, బిలోలి, హవర్గ, మన్మద్ గ్రామాల్లో దివ్యాంగులకు రుణాలు, డబుల్ బెడ్రూం, పెన్షన్, సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రవీణ్ మాయమాటలు చెప్పాడు. అతని మాటలు నమ్మి పలువురు రూ.3 లక్షల డబ్బులు చెల్లించారు. ప్రవీణ్ నాలుగేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. ధర్మోర గ్రామానికి చెందిన తెనుగొండ ఎంకవ్వ ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెక్‌పోస్ట్ ధ్వంసం కేసులో ఇద్దరు యువకులకు జైలు

కడెం: మండలంలోని పాండ్వపూర్‌లో అటవీశాఖ చెక్‌పోస్టును ధ్వంసం చేసిన కేసులో ఇద్దరు యువకులకు 14 రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం నిర్మల్ ఫస్ట్‌క్లాసు మెజిస్ట్రేట్ అజయ్ తీర్పు వెలువరించారు. పాండ్వపూర్‌కు చెందిన సుద్దాల రాజేశ్, కోటే మహేశ్‌ను గత ఫిబ్రవరి 8న చెక్‌పోస్ట్‌పై దాడి చేసి, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారు. నిర్మల్ కోర్టులో వారిని ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో 14 జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారని ఎస్సై కొనన రాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో సోమవారం పేకాట స్థావరంపై స్పెషల్ టీం దాడి చేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ. 5630 నగదుతోపాటు ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకున్నామని పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ

ముధోల్: మండలంలోని తరోడ గ్రామంలో ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సిలరే గంగాధర్, భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి ఈనెల 4న తిరుపతికి పయనమయ్యారు. ఇంటికి తాళం వేశారు. ఎప్పటిలాగే తాళం చెవి వారికి తెలిసిన చోట పెట్టారు. ఆదివారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూస్తే బీరువాలో 3 తులాల బంగారం, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


పశువులకు లంపీస్కిన్



లేగదూడకు సోకిన లంపిస్కిన్

కుభీర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకింది. కుభీర్‌లోని విఠలేశ్వర మందిరానికి చెందిన ఆవులు ఐదారు ఉన్నాయి. అందులో ఒక లేగదూడకు ఈ వ్యాధి సోకింది. ఈ విషయమై పశువైద్యుడు విశ్వజిత్ మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువును మిగతావాటికి దూరంగా ఉంచాలని అన్నారు. ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాక్సిన్ వేస్తామన్నారు.

కుప్టి..ప్రాణాలు హరీ



ప్రమాదాలు జరుగుతున్న కుప్టి బ్రిడ్జి ఇదే..

- కుప్టి బ్రిడ్జి వద్ద తరచూ ప్రమాదాలు
- మలుపుల వద్ద అదుపుతప్పుతున్న వాహనాలు
- ప్రతిఏటా 50 మందికి పైగా మృత్యువాత
- బ్లాక్‌స్పాట్‌గా గుర్తించినా చర్యలు శూన్యం

ఇచ్చోడ: నేరడిగొండ–ఇచ్చోడ మండలాల మధ్య కుప్టి బ్రిడ్జి వద్ద తరచూ జరుగుతున్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు ఏటవాలుగా ఉండటంతోపాటు బ్రిడ్జి సమీపంలో మూలమలుపు ఉండటంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. లారీ డ్రైవర్లు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రతిఏటా 50కి పైగా మంది మృత్యువాత పడుతున్నారు. చాలా మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రమాదాల్లో అనేక కుటుంబాల్లో తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నాయి. అధికంగా ద్విచక్రవాహనదారులే మృత్యువాత పడుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గతంలో కుప్టి బ్రిడ్జి బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. కానీ తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఏడు నెలల్లో 13 మంది..

గతేడాది అక్టోబర్ నుంచి ఈనెల ఏప్రిల్ 4 వరకు 44వ జాతీయ రహదారి కుప్టి బ్రిడ్జిపై 30కి పైగా రోడ్డు ప్రమాదాల్లో 13 మంది మృత్యువాత పడగా, మరో 10 మంది వరకు గాయాల పాలయ్యారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఈ రహదారి విస్తరించి ఉంది. జిల్లా పరిధిలో ఈ రోడ్డు 110 కి.మీ ఉండగా, బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ సర్కిల్ పరిధిలో దాదాపు 80 కి.మీ పొడవులో ఉంటుంది.

నేషనల్ హైవే అథారిటీ తప్పిదం..

నేషనల్ హైవే అథారిటీ తప్పిదమే కుప్టి బ్రిడ్జి వద్ద మృత్యురూపంలో వెంటాడుతోంది. తరచూ ప్రమాదాల్లో ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న వారు తమ గమ్యస్థానాలకు చేరుకోకుండానే నిమిషాల వ్యవధిలో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రెండు భారీ కొండల మధ్యన కడెం వాగుపై కుప్టి బ్రిడ్జి ఉంది. నాలుగు వరుసల 44వ జాతీయ రహదారి పనుల్లో భాగంగా గతంలో ఉన్న ఘాట్ రోడ్డును మూసివేశారు. నూతనంగా రెండు కొండల మధ్య నుంచి ఘాట్ కటింగ్ చేసి రోడ్డును నిర్మించారు. ఇరువైపులా దాదాపు 3 కి.మీ పొడవునా రహదారి కిందికి ఏటవాలుగా ఉంది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బ్రిడ్జి దగ్గరలో మూలమలుపు ఉంది. రహదారి కిందికి డౌనల్ ఉండటంతో వాహనాల డ్రైవర్లు గేర్ న్యూట్రల్ చేయడంతో కనీసం 100 కి.మీ వేగంతో వాహనాలు వెళ్తాయి. బ్రిడ్జి వద్ద ఉన్న మలుపు ప్రాంతంలోకి రాగానే అవి అదుపు తప్పుతున్నాయి. దీంతో పక్కనుంచి ప్రయాణిస్తున్న వాహనాలను ఢీ కొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.




కుప్టి బ్రిడ్జిపై నుంచి వాగులో పడిపోయిన టిప్పర్ (ఫైల్)

ప్రమాదాలు ఇలా..

- ఈనెల 4న బైక్‌ను కుప్టి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.
- గతేడాది నవంబర్‌లో కుప్టి బ్రిడ్జిపై నుంచి టిప్పర్ వాగులో పడ్డ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.
- గతేడాది అక్టోబర్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. మే నెలలో జరిగిన ప్రమాదాల్లో వివిధ సంఘటనలో ఐదుగురు మృతి చెందారు.

నివేదించాం



జిల్లా ఎస్పీ ఆదేశాలతో కుప్టి బ్రిడ్జి వద్ద జరుగుతున్న ప్రమాదాలపై నివేదికను తయారు చేసి నేషనల్ హైవే అథారిటీ వారికి అందజేశాం. తరచూ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. ప్రమాదాల నివారణకు తమవంతు చర్యలు తీసుకుంటాం.

– ముదావత్ నైలు, ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

కదంతొక్కిన బీడీ కార్మికులు



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న బీడీ కార్మికులు

- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, ధర్నా
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు

కైలాస్‌నగర్: అర్హులైన తమకు పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు సోమవారం కదంతొక్కారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పట్టణంలోని తానీషా గార్డెన్‌లో సమావేశమయ్యారు. అక్కడి నుంచి బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినీరెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ మెయిన్‌గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపిన బీడీ కార్మికులు, పోలీసులను తోసుకుని కార్యాలయం లోనికి చొచ్చుకెళ్లారు. అక్కడ బైఠాయించి కలెక్టర్ రావాలంటూ నినదించారు. ట్రెయినీ కలెక్టర్ డా.పి.శ్రీజ వారి వద్దకు రాగా తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా సుహాసినీరెడ్డి మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో బీడీ కార్మికులకు సీఎం కేసీఆర్ హామీఇచ్చి విస్మరించారని ఆరోపించారు. పీఎఫ్ ఉన్న ప్రతి బీడీ కార్మికునితో పాటు ఏజెంట్లకు కూడా పింఛన్ అమలు చేస్తామని చేయలేదన్నారు. వెయ్యి బీడీలు చూడితే రూ.200 వస్తాయన్నారు. వాటి కోసం కార్మికులు ఇంటి పనులు వదుకోవాల్సి వస్తుందని, అద్దె ఇళ్లలో ఉండి కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి జీవో 38 ప్రకారం అర్హులైన కార్మికులందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు జీవీ రమణ, కాంత, బీడీ కార్మికులు గంగమణి, కిరణ్, రజిత, లక్ష్మి, రజియా తదితరులున్నారు.



బైఠాయించిన బీడీ కార్మికులు

భైంసాలో నకిలీ నోట్ల కలకలం..!



నకిలీదిగా అనుమానిస్తున్న నోట్(పైనది)



నోటును పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతి

భైంసాటౌన్: పట్టణంలో సోమవారం కూరగాయల వారసంతలో నకిలీ నోట్ల కలకలం రేపింది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో దాదాపు పన్నెండేళ్ల ఓ బాలుడు భోకర్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ అనే వ్యాపారి వద్ద రూ.500 నోటు ఇచ్చి రూ.20 కూరగాయలు కొనుగోలు చేసి రూ.480 తీసుకెళ్లాడు. తిరిగి కొద్దిసేపటికి మరో రూ.500 నోటుతో వచ్చి కూరగాయలు తీసుకుంటుండడంతో నోటు నకిలీదని అనుమానం వచ్చిన ప్రవీణ్ సదరు బాలుడిని పట్టుకునేందుకు యత్నించగా పారిపోయాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై తిరుపతి అక్కడికి చేరుకుని నోట్లు పరిశీలించారు. బాలుడి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించే చర్యలు చేపడుతామన్నారు.

కలెక్టరేట్ ఎదుట రిటైర్డు ఉద్యోగుల నిరసన దీక్ష

కైలాస్‌నగర్: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మారెడ్డి, పి.కిష్టయ్య డిమాండ్ చేశారు. సోమవారం రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. తొలుత తెలంగాణ చౌక్‌లోని తమ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి దీక్షలో కూర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు ప్రతి నెల 1న పెన్షన్‌ను వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆదాయ పన్ను నుంచి మినహాయింపునివ్వాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను ప్రైవేట్ ఆసుపత్రుల్లో అమలు చేసేలా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. నగదు రహిత ఆరోగ్య సేవలందించాలని డిమాండ్ చేశారు. మూడు డీఏలను విడుదల చేయడంతోపాటు కొత్త పీఆర్సీని అమలు చేయాలన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజకు అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ పాండే, సంఘం నాయకులు ఎం.రాజేశ్వర్‌రెడ్డి, సుధాకర్, నరేందర్, సుధీర్, రాంకులకర్ణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కలప వ్యాన్ స్వాధీనం

గుడిహత్నూర్: అక్రమంగా తరలిస్తున్న టేకు కలప వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో పక్కా సమాచారంతో సీఐ నైలూనాయక్, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌లు రెండు బృందాలుగా ఏర్పడి సోమవారం తెల్లవారుజాము మండల కేంద్రంలోని హిందుస్తాన్ దాబా సమీపంలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా నిలిపి ఉన్న వ్యాన్‌ను తనిఖీ చేస్తుండగా ఇద్దరు పరారయ్యారు. దీంతో వ్యానులో 48 టేకు దుంగలు ఉన్నాయి. వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో పాండురంగ్, సెక్షన్ ఆఫీసర్ కృష్ణ నాయక్, ఎఫ్‌బీవో నర్సయ్యలు వ్యాన్‌ను ఇచ్చోడ కలప డిపోకు తరలించారు. కలప విలువ రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. తనిఖీల్లో ఏఎస్సై బలిరాం, కానిస్టేబుళ్లు విట్టల్, భూమన్న, సదాశివ్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న కలప వాహనంతో పోలీసు, అటవీ అధికారులు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భైంసా: బాసర గోదావరి నది రైల్వేవంతెన వద్ద ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్‌ఖాన్ సోమవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయసు 40 ఏళ్లు ఉండవచ్చని, సంబంధీకులు బాసర రైల్వేపోలీసులను సంప్రదించాలని కోరారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు



ఖానాపూర్: పట్టణంలో నత్తనడకన సాగుతున్న రోడ్డు వైడింగ్ పనులు ప్రజల ప్రాణాలకు ప్రాణసంకటంగా మారాయి. ఇరుకురోడ్డు కారణంగా గత మూడు రోజుల క్రితం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ ఘటన మరువకముందే సోమవారం ఓ కారు డివైడర్‌ను ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న పలువురికి గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న దగ్ధం

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) శివారులో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైంది. మండల కేంద్రానికి చెందిన పుష్ప మైస్కర్ అనే మహిళా రైతుకు చెందిన మూడెకరాల 37 గుంటలో మొక్క జొన్న సాగు చేసింది. ఇటీవల కోత కోసి కుప్పపోసింది. షార్ట్ సర్క్యూట్‌తో చేతికొచ్చిన పంట పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.లక్షా 50 వేలు నష్టం వాటిల్లిందని బాధిత మహిళ రైతు తెలిపింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంది.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు త్వరగా పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వారి అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున గిరిజన గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పీవీటీజీ అధికారి భాస్కర్, జేడీఎం నాగభూషణం, ఏవో రాంబాబు, పీఈటీసీ ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా రుణం మంజూరు చేయాలని నార్నూర్ మండలం మహాగావ్‌కు చెందిన రాథోడ్ భరత్, ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన శ్రీధర్ కుమార్ అర్జీలు సమర్పించారు.
- ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమికి అటవీ హక్కు పత్రం అందించాలని బజార్‌హత్నూర్ మండలం లక్ష్మణ్‌నాయక్ తండాకు చెందిన అడె శ్రీరాం వేడుకున్నాడు.
- గిరి వికాసం ద్వారా తన పంట పొలం వద్ద బోరు బావి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఇంద్రవెల్లి మండలం ధన్నోర(బి)కి చెందిన కుర్సెంగ ప్రభాకర్ అర్జీ పెట్టుకున్నాడు.

ఇచ్చోడలో ప్రవేశపరీక్ష పరిశీలన



పరిశీలిస్తున్న ఏటీడీవో సౌజన్య

ఇచ్చోడ: వచ్చే విద్యాసంవత్సరంలో గిరిజన విద్యార్థుల కోసం జిల్లాలో రెండు సైన్స్ ఒలింపియాడ్ మోడల్ స్కూళ్లు ప్రారంభించనున్నట్లు ఏటీడీవో సౌజన్య తెలిపారు. ఇచ్చోడలో ఆశ్రమ పాఠశాల్లో ఒలింపియడ్ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు సోమవారం పరీక్ష నిర్వహించారు. ఆమె పరిశీలించి మాట్లాడారు. సైన్స్ ఒలింపియాడ్ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు 5 నుంచి 7 వతరగతి వరకు, ప్రతి తరగతి నుంచి 40 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. ఆమె వెంట జీసీడీవో మెస్రం ఛాయ ఉన్నారు.

పిచ్చికుక్కదాడిలో బాలుడికి గాయాలు



గాయాలైన శ్రీకర్

లక్ష్మణచాంద: సోన్ మండలంలోని న్యూవెల్మల్‌లో సోమవారం పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలయ్యాయి. అగ్గు శ్రీకర్(10) ఇంటి వద్ద ఆడుకుంటుండగా అటువైపు వచ్చిన పిచ్చి కుక్క దాడి చేసింది. శ్రీకర్‌ను తండ్రి దిలీప్ స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యురాలు సమత ప్రాథమిక చికిత్స చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేపడుతాం

- టీఎస్‌పీఈ జేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 17 నుంచి సమ్మె చేపడుతామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గతేడాది పీఆర్సీలో 35 శాతం ఇచ్చారని, ఈసారి ప్రభుత్వం 7 శాతం లోపే పీఆర్సీ ఇస్తామని పేర్కొనడం సరికాదన్నారు. ఈపీఎఫ్ టు జీపీఎఫ్ నిధులు 1999 సంవత్సరం వరకే ఇచ్చారని, 2004 వరకు వాటిని చెల్లించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల మంది కార్మికులను రెగ్యులరైజ్ చేశామని ప్రభుత్వం ప్రకటించినా వారికి రెగ్యులర్ ఉద్యోగులతో సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ సమ్మెలో 23 సంఘాలతో కలిసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం బాధ్యులు శ్రీధర్, రత్నాకర్, సదానందం, శ్రీనివాస్, రమేశ్, జనార్దన్‌రెడ్డి, గౌతమ్, ఉమ్మడి జిల్లాకు చెందిన కార్మికులు, ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్లు, స్పాట్ బిల్లర్లు, కలెక్షన్ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ కేటాయింపు చరిత్రాత్మకం

- ఓసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: అగ్రవర్ణాల పేదలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్ అమలు చేయడం చరిత్రాత్మకమని ఓసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎస్‌జీఓస్ సంఘ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 103వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలోని అగ్రవర్ణాల పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించడంతో ఓసీలకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. ఇతర సామాజిక వర్గాలకు ఇబ్బందులు కలగకుండా కేంద్రం ఇచ్చిన రిజర్వేషన్లను వ్యతిరేకించడం సరికాదన్నారు. అగ్రవర్ణాల పేదలు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి లక్ష కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జనగం సంతోష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES
VEHICLE FOR SALE

Vehicles for Sale on Where Conditions Vehicles for Sale. TS-19T-4677 - AL 3718 BS-IV - 2018, INDUSIND BANK LTD, Mancherial Branch, Contact: 7338879680. [K-1217003]

SERVICES

అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 9115551443. [T-03]

www.sakshi.com

WANTED

HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం: వసతి కలదు. సంప్ర: 040-66366664, 9392663777, 9246663777 [HA-1330]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,